సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
సోమవారం, 25.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 213
పేజీలు: 08 వెల: రూ. 5

## 39.6 కిలో మీటర్లు
# ₹7168 కోట్లు
### ఓఆర్ఆర్ చుట్టూ మెట్రో..

- మెట్రో మూడో దశ విస్తరణకు సర్కార్ కసరత్తు
- క్యూర్ పరిధిలో అన్నివైపుల మెట్రో రైలు కనక్టివిటీని పెంచేలా ప్రణాళికలు
- హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శరవేగంగా విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహా నగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే రోజుల్లో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తోంది. మెట్రో రైలు రాకతో హైదరాబాద్ రవాణా వ్యవస్థలో కీలక మార్పులు రాగా.. రెండో దశ మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మూడో దశ మెట్రో విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) చుట్టూ మెట్రో మూడో దశ విస్తరణ చేపట్టాలని భావిస్తోంది. దీనికి సంబంధించి హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఈ మూడో దశ మెట్రో రైలు విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో నిత్యం 40 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలో ప్రయాణాలు మిగతా 02లో

## త్రివేణి సంగమానికి
# పోటెత్తిన భక్తులు
### ఆధ్యాత్మికం.. పరవశం

04

- కాళేశ్వరంలో వైభవంగా సరస్వతీ అంత్య పుష్కరాలు
- హరహర మహాదేవ నినాదాలతో మారుమోగిన క్షేత్రం



దక్షిణ శైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న సరస్వతీ నది అంత్య పుష్క రాలు ఆదివారం అత్యంత వైభవంగా కొనసాగాయి. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల కలయికైన పవిత్ర త్రివేణి సంగమంలో పుష్క రస్నానాలు ఆచరించేందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూ లలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న ఈ పుష్క రాల్లో తెల్లవారుజాము నుంచే ఘాట్ల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్క ర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..



## బోథ్ అటవీ రేంజ్ పరిధిలో పెద్ద పులి సంచారం

03

బుద్దికొండ - వడూర్ మధ్య రోడ్డుపై కనిపించిన పెద్ద పులి
అప్రమత్తమైన అటవీ శాఖ.. ఆనవాళ్ల కోసం గాలింపు..



## జర్నలిస్టుల సమస్యల
# పరిష్కారమే ధ్యేయం
### టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, కార్యదర్శి రాం నారాయణ




- 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యూనియన్లో ఉండటం గర్వకారణం
- వృత్తికి కళంకం తెచ్చే కలుపు మొక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఘనంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా 3వ మహాసభ
- జర్నలిస్టుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

03

## కాలి బూడిదైన 'మేడిగడ్డ' కీలక డాక్యుమెంట్లు!

02

- కుంగిన పిల్లర్ల డాక్యుమెంట్లు, ఫైళ్లు దగ్ధం
- పిల్లర్ల కుంగుబాటుపై విచారణ క్రమంలో అగ్నిప్రమాదం



## ధాన్యం సేకరణకు
# యాక్షన్ ప్లాన్
### ధాన్యం తరలింపునకు ఇసుక, సిమెంట్ లారీల వినియోగం



- కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరుతో రైతుల్ని మోసం చేస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ ఇచ్చి రైతుల్ని నష్టపర్చే రైస్ మిల్లులు బ్లాక్ లిస్టులో పెడతాం
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



# నిప్పుల కుంపటి
### నేడు రోహిణి కార్తె తీవ్రత అధికం

- వడదెబ్బకు 85 మంది మృతి
- రాష్ట్ర వ్యాప్తంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- మృతుల కుటుంబాలకు ₹4 లక్షల పరిహారం: మంత్రి పొంగులేటి
- జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు
- ఉదయం, సాయంత్రం ప్రయాణాలకు ప్రాధాన్యమివ్వాలి

**ముద్ర డెస్క్ :** తెలంగాణపై భానుడు భగభగమంటూ విరుచుకుపడుతున్నాడు. రోహిణి కార్తె ప్రారంభమైన నాటి నుంచే ఎండల తీవ్రత అమాంతం పెరిగిపోయి రాష్ట్రాన్ని అగ్ని గుండంలా మార్చేసింది. ఉదయం ఆరు గంటలకే మండిపోతున్న సూర్యుడు రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. ఎండలు, వడగాల్పుల దెబ్బకు ప్రజలు ఇళ్లలోనూ బయటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 85 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది.

శుక్రవారం ఒక్కరోజే 34 మంది వడదెబ్బకు బలైపోగా.. శనివారం మరో 51 మందికిపైగా మృతి మిగతా 02లో

## బైకులు, కార్లతో రేసర్ల
# హంగామా
### మాదాపూర్ టీ హబ్ ఏరియాలో అర్ధరాత్రి యూత్ రచ్చ

03

- భారీ సౌండ్తో అర్ధరాత్రి కార్ రేసింగ్
- పోలీసులపైకి దూసుకెళ్లిన కారు
- తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్
- పరారైన రేసర్లు.. పోలీసుల గాలింపు





## నేటి నుంచి
# రైతు గోస - బీజేపీ భరోసా
వడ్ల కొనుగోలు కేంద్రాల పరిశీలన

### ధాన్యం కొనుగోళ్లపై వాస్తవాలు ప్రజలకు తెలిసేలా క్షేత్రస్థాయి పర్యటన

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

02

## జూన్ 2 నుంచి
# ఇందిరమ్మ బీమా
### పేదరికంపై సమరం: డిప్యూటీ సీఎం భట్టి

**ఖమ్మం, ముద్ర :** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మక 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. కుల మతాలకు అతీతంగా, పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఈ భీమా రక్షణ కవచంలా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు కనీసం రూ.లక్ష సాయం కోసం చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని భట్టి విమర్శించారు. అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే, ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన ప్రతి ఇంటికీ రూ. 5 లక్షల భీమా వర్తింపజేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. దీనికి సంబంధించి అధికారులు త్వరలోనే ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆదివారం ఖమ్మం మిగతా 02లో



- రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల భీమా రక్షణ
- మహిళా సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు
- సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో ప్రజా సంక్షేమమే లక్ష్యం


## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews



## ఎబోలా వైరస్ లక్షణాలు.. జాగ్రత్తలు




ఎబోలా వైరస్ సోకినప్పుడు మొదట అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.ఈ లక్షణాలను సాధారణ వైరల్ ఫీవర్‌గా భావించి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం.

# 39.6 కిలో మీటర్లు ₹7168 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇక హైదరాబాద్ మెట్రోలో దాదాపుగా 6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో అన్నివైపుల మెట్రో రైలు కనెక్టివిటీని పెంచేందుకు ప్రణాళికలు తయారు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కిలోమీటర్ల మార్గాన్ని రూ.7,168 కోట్ల అంచనాలతో రెండో దశ(బీ)గా ప్రతిపాదనలు చేశారు. అయితే దీన్నే హైదరాబాద్ మెట్రో మూడో దశ ప్రాజెక్టుగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వం... కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మూడో దశలోనే ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) మెట్రో రైలును విస్తరించాలని భావిస్తోంది. రెండో దశ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆమోదం కల్పించగానే దానికి సంబంధించిన పనులను చేపట్టడంతోపాటు మూడో దశ మెట్రో ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు, డీపీఆర్ తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**158 కిలోమీటర్ల మేర ఓఆర్ఆర్..**

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓఆర్ఆర్ 158 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అయితే మెట్రో రెండో దశ ప్రతిపాదనలు కూడా ఓఆర్ఆర్‌కు సమీపంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ తరహాలో అన్ని ప్రాంతాను కలిపే విధంగా మెట్రో రైలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఇబ్రహీంపట్నం, పటాన్ చెరు, చౌటుప్పల్, మేడ్చల్, శామీర్‌పేట్, శంషాబాద్, తుక్కుగూడ, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపార, ఉపాధి కోసం నిత్యం వేలమంది హైదరాబాద్‌కు వస్తున్నారు. దీంతో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ భారీగా పెరిగిపోతోంది. దీన్ని అధిగమించేందుకు మెట్రో రైలే పరిష్కారమని సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే మొదటి దశలో 69 కిలోమీటర్ల మెట్రో రైలు ఉండగా.. రెండో దశలో 122.6 కిలోమీటర్లు.. ఓఆర్ఆర్ చుట్టూ మూడో దశలో 160 కిలోమీటర్లు.. భారత్ ఫ్యూచర్ సిటీ 39.6 కిలోమీటర్లు ఇలా మొత్తం 391 కిలోమీటర్ల మేర హైదరాబాద్ మెట్రో రైలును విస్తరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## కాలి బూడిదైన 'మేడిగడ్డ' కీలక డాక్యుమెంట్లు!

**ముద్ర, జయశంకర్ భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజి వద్ద ఉన్న ఎల్అండ్‌టీ సంస్థ కార్యాలయంలో ఈనెల 23న రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కంప్యూటర్లు, ఫర్నిచర్‌తో పాటు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి, డిజైన్లకు సంబంధించిన అనేక కీలకమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మేడిగడ్డ బ్యారేజికి సంబంధించిన కొన్ని పిల్లర్లు కుంగిపోయిన ఉదంతంపై ఇప్పటికే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ), విజిలెన్స్ విభాగాలు, న్యాయ కమిషన్ విచారణలు జరుపుతున్న తరుణంలో, ఈ అగ్నిప్రమాదం సంభవించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుంగిపోయిన పిల్లర్ల పునరుద్ధరణ, వాటి స్థిరత్వంపై నిపుణుల కమిటీలు క్షేత్రస్థాయిలో కీలకమైన పరీక్షలు నిర్వహిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినా అప్పటికే కార్యాలయం అధిక భాగం దెబ్బతిన్నది. ఈ ఉదంతంపై స్థానిక పోలీసులు నిశితంగా దర్యాప్తు ప్రారంభించారు. ఇది కేవలం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జరిగిన ప్రమాదమా? లేదా బ్యారేజీ విచారణకు సంబంధించిన కీలక ఆధారాలను, రికార్డులను ధ్వంసం చేసేందుకు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రా? అనే కోణంలో భద్రతా బలగాలు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగి లోతుగా విచారణ జరుపుతున్నాయి.

## నేటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా'

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మెదక్ ఎంపి రఘునందన్ రావు ఆరోపించారు. ఆ అసత్యాలకు తెరలేపేందుకు, ప్రజలకు వాస్తవాలు తెలిసేలా నేటి నుంచి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద 'రైతు గోసా – బీజేపీ భరోసా' పేరిట యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ యాత్రలో పాల్గొంటారని తెలిపారు. రైతులతో రాజకీయాలు చేయడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో సీఎం సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన లెక్కలను చూసి తప్పుడు సమాచారం చెప్పడం సరికాదని అన్నారు. సీఎం హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి నేరుగా రైతులతో మాట్లాడితే ధాన్యం ఎంత కొనుగోలు చేస్తారో తెలుస్తోందని చెప్పారు. రెండు రోజుల పాటు రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము మాట్లాడిస్తామని చెప్పారు. తాము రాజకీయాలే చేయాలనుకుంటే వేరేలాగా చేస్తామన్నారు. తమకు కావాల్సింది రైతుల సంక్షేమమని స్పష్టం చేశారు. అన్నదాతలకు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ బీమా'



(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. అనంతరం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్స్ లో జరిగిన సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ సన్మాన కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ నెల 27న మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు కేటాయించే పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

**లక్ష కోట్లకు వడ్డీలేని రుణాలు**

మహిళా సంఘాలకు ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైతే దీనిని రూ. లక్ష కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని తెలి పారు. త్వరలో మహిళా వ్యాపారవేత్తల కోసం ప్రత్యేకంగా 550 ఆర్టీసీ బస్సులను కేటాయించనున్నట్లు వెల్లడించారు. కోటి మంది మహిళ లను కోటీశ్వరులను చేసేందుకు తమ ప్రభు త్వం కృషి చేస్తోందన్నారు.

**గ్రామాల్లో 'సన్నబియ్యం' పండుగ**

మార్కెట్లో కిలో రూ. 50–55 పలుకుతున్న మేలు రకం సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రకటించారు. ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున నేరుగా పేదల ఇళ్లకే సన్న బియ్యాన్ని పంపిస్తామని చెప్పారు.

**గృహజ్యోతితో 53 లక్షల కుటుంబాలకు లబ్ది**

రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండటంతో రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు కరెంటు బిల్లుల భారం తప్పిందన్నారు. అనేక గ్రామాల్లో 95 శాతం ప్రజలు 'జీరో' బిల్లులు పొందుతున్నారని వివరించారు.

**సొంతింటి కల సాకారం**

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని భట్టి ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. నిన్నటి క్యాబి నెట్ సమావేశంలో మరో 2 లక్షల ఇళ్లను అద నంగా మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. గుడిసెలు లేని రాష్ట్రం గా తెలంగాణను నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్య లక్ష్యమని అని చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక కార్యకర్తలే దగ్గరుండి గృహప్రవేశాలు చేయించాలని సూచించారు.

**అల్పాహారంతో విద్యార్థులకు భరోసా**

ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా ఉచిత 'బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని ప్రవేశపెట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

**ప్రతి గింజను కొంటాం**

రైతుల పండించిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని రైతులకు ఉప ముఖ్యమంత్రి ధైర్యం చెప్పారు. దేశంలో ఎక్కడా మొక్కజొన్న కొను గోళ్లు జరగకపోయినా, తెలంగాణలో పండిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభు త్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులను ఆదుకుంటోందని అన్నారు. రైతుల అవసరాల కోసం క్యాబినెట్‌లో చర్చించి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**కుట్రలను తిప్పికొట్టండి!**

ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, అటువంటి కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ పాంప్లెట్లు పంపిణీ చేస్తా మని, కాంగ్రెస్ కార్యకర్తలు గర్వంగా, తలెత్తుకుని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వాస్తవా లు వివరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# నిప్పుల కుంపటి

(మొదటి పేజీ తరువాయి)

చెందినట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మృతుల్లో అధికంగా వృద్ధులు, వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మధ్యాహ్నం వేళల్లో పనిచేసే కూలీలు తీవ్ర ఎండలను తట్టుకోలేక కుప్పకూలుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కుంచవెల్లి, కాగజ్‌నగర్‌లలో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా ధర్మపురి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో 46.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఖమ్మం రూరల్, వైరా, మంచిర్యాల జిల్లా తాండూరులో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా పలు ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో నగరవాసులు తీవ్ర ఉక్కపోతను ఎదుర్కొన్నారు.

ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అప్రమత్తమైంది. వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ప్రజలు అత్యవసరం లేకపోతే మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లోనే ప్రయాణాలకు ప్రాధాన్యం



ఇవ్వాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇక వాతావరణ శాఖ కూడా రానున్న మూడు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. రోహిణి కార్తె ప్రభావంతో వడగాల్పులు మరింత ఉధృతమవుతాయని తెలిపింది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు ఎండల దెబ్బకు రహదారులు వేడెక్కిపోతుండగా, పల్లెల్లో బోర్లు ఎండిపోతున్నాయి.

## ముంబై ఇండియన్స్‌పై విజయం.. ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్ రాయల్స్

**ముద్ర డెస్క్:**

ఐపీఎల్ 2026లో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ చివరి ప్లే ఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకుంది. 206 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన ముంబయి.. నిర్ణీత 20 ఓవర్లలో 175/9 పరుగులు మాత్రమే చేసింది. సూర్య కుమార్ యాదవ్ (60; 42 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సలు) పోరాడినా ముంబయికి ఓటమి తప్పలేదు. హార్దిక్ పాండ్య 34, విల్ జాక్స్ 33 రన్స్ చేశారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు.. యశ్ రాజ్, నాంద్రే బర్గర్, బ్రిజేశ్ శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ విజయం సాధించడంతో కోల్‌కతా, పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు ఆవిరయ్యాయి. దీంతో ప్రస్తుతం దిల్లీ, కేకేఆర్ మధ్య జరుగుతున్న మ్యాచ్ నామమాత్రంగా మారింది. మే 27న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 205/8 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ 38, జోఫ్రా ఆర్చర్ 32, శనక 29, యశస్వి జైస్వాల్ 27, ఫెరీరా 18, పరాగ్ 14, శుభమ్ దూబె 5, వైభవ్ సూర్యవంశీ 4, జడేజా 19★, నాంద్రె బర్గర్ 10★ రన్స్ చేశారు. MI బౌలర్లలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. విల్ జాక్స్, ఘజన్‌ఫర్, బాష్ తలో వికెట్ తీశారు.

# పాకిస్తాన్ లో నరమేధం..

### జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలుపై బెలూచ్ ఆర్మీ ఆత్మాహుతి దాడి.. 23 మంది మృతి!

**ముద్ర డెస్క్:**

ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, సరిహద్దు ఉగ్రవాదంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌ను అంతర్గత యుద్ధ మేఘాలు కమ్మేస్తున్నాయి. ఆ దేశంలో భద్రత అనేది ఎండమావిగా మారుతోంది. ముఖ్యంగా అసంతృప్తితో రగిలిపోతున్న బలూచిస్థాన్ ప్రాంతంలో పరిస్థితులు రోజురోజుకూ అదుపు తప్పుతున్నాయి. తాజాగా బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టాలో జరిగిన ఒక భారీ ఆత్మాహుతి పేలుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

పాకిస్తాన్ ప్రభుత్వానికి, సైన్యానికి వ్యతిరేకంగా దశాబ్దాలుగా సాయుధ పోరాటం చేస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. ఈ భయానక దాడిలో ఇప్పటివరకు 23 మంది ప్రాణాలు కోల్పోగా మరో 47 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో అమాయక మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉండటం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

రక్తాశ్రితమైన రైల్వే ట్రాక్.. అసలేం జరిగింది?

స్థానిక అధికారులు.. భద్రతా బలగాల సమాచారం ప్రకారం... క్వెట్టా–చమన్ గేట్ సమీపంలో ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న ఒక ప్యాసింజర్ రైలును లక్ష్యంగా చేసుకుని ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. రైలు బయలుదేరే సమయానికి ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి కిలోమీటరు పరిధిలోని ఇళ్లు, దుకాణాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. రైల్వే ట్రాక్ పరిసరాల్లో నిలిపి ఉంచిన అనేక కార్లు, ద్విచక్ర వాహనాలు అస్థిపంజరాలుగా మారాయి. పేలుడు సంభవించిన వెంటనే రైలులోని ఒక బోగీలో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు ప్రాణభయంతో చెల్లాచెదురుగా పరుగులు తీశారు. ఘటనాస్థలి అంతా రక్తపు మడుగులు, తెగిపడిన శరీర భాగాలు, ధ్వంసమైన రైలు బోగీలతో ఒక యుద్ధ ప్రాంతాన్ని తలపించింది.

**దాడి మాదే.. సైన్యమే మా టార్గెట్: బీఎల్ఏ ప్రకటన**

ఈ ఘోర ఉగ్రదాడికి తామే బాధ్యులమని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) అధికారికంగా ప్రకటించింది. పాకిస్తాన్ సైన్యానికి కోలుకోలేని దెబ్బకొట్టడమే తమ వ్యూహమని వారు పేర్కొన్నారు. 'జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా పాకిస్తాన్ సైన్యానికి చెందిన భారీ బలగాలు పెషావర్ ప్రాంతానికి తరలివెళ్తున్నాయనే పక్కా సమాచారంతోనే మేము ఈ ఆపరేషన్ చేపట్టాము. మా పోరాటం పాక్ సైన్యంపైనే.' అని తెలిపారు. అయితే బీఎల్ఏ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకున్నామని చెబుతున్నప్పటికీ ఈ దాడిలో భారీ సంఖ్యలో సాధారణ, అమాయక ప్రయాణికులు బలికావడంపై సమాజం నుండి విమర్శలు న్నాయి.

**సహాయక చర్యలు.. పెరుగుతున్న మృతుల సంఖ్య**

ప్రమాదం జరిగిన వెంటనే పాకిస్తాన్ ఆర్మీ, స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. గాయపడిన వారిని అత్యవసరంగా క్వెట్టాలోని సమీప ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలో చాలా మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, దీనివల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బలూచిస్థాన్ ఎందుకు రగులుతోంది?**

బలూచిస్థాన్ ప్రాంతం చాలా కాలంగా పాకిస్తాన్ పాలకులకు ఒక పీడకలగా మారింది. ఈ ప్రాంతంలో అసంతృప్తి జ్వాలలు రగలడానికి ప్రధాన కారణాలున్నాయి. బలూచిస్థాన్ ప్రాంతం గ్యాస్, ఖనిజాలు వంటి సహజ వనరులతో సమృద్ధిగా ఉంది. కానీ ఇక్కడి నుండి వచ్చే ఆదాయాన్ని పాక్ ప్రభుత్వం తమ ప్రాంత అభివృద్ధికి కాకుండా ఇతర ప్రావిన్స్‌లకు తరలిస్తోందని బలూచ్ ప్రజల ప్రధాన ఆరోపణ. పాకిస్తాన్ ఆర్మీ బలూచ్ ప్రజలపై తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతోందని, ప్రశ్నించిన వేలాది మంది బలూచ్ యువకులను బలవంతంగా అదృశ్యం చేస్తోందని మానవ హక్కుల సంఘాలు సైతం ఆరోపిస్తున్నాయి. ఈ వివక్ష వల్లే తాము పాకిస్తాన్‌తో కలిసి ఉండలేమని, "స్వతంత్ర బలూచిస్థాన్" సాధించడమే తమ ఏకైక లక్ష్యమని బీఎల్ఏ వంటి సంస్థలు సాయుధ పోరాటాన్ని ఉధృతం చేశాయి.

**విశ్లేషకుల హెచ్చరిక.. క్వెట్టాలో హై అలర్ట్**

పాకిస్తాన్‌లో వరుసగా జరుగుతున్న ఉగ్రదాడులు, అంతర్గత తిరుగుబాట్లు ఆ దేశ భద్రతా, ఇంటెలిజెన్స్ వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగడుతున్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే దివాళా అంచున ఉన్న పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు, ఇటువంటి అంతర్గత యుద్ధ పరిస్థితులు శవపాచీగా మారుతాయని హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం క్వెట్టా,దాని పరిసర ప్రాంతాలలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు జరిగే ముప్పు ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. భయానక వాతావరణం మధ్య బలూచ్ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews


## ఎబోలా వైరస్ లక్షణాలు.. జాగ్రత్తలు

కండరాల నొప్పులు, గొంతు నొప్పి, శరీరం బలహీనంగా మారడం కూడా ఎబోలా ప్రారంభ సంకేతాలుగా ఉండొచ్చు. ముఖ్యంగా ఇటీవల వైరస్ ప్రభావిత ప్రాంతాలకు వెళ్లిన వారు ఈ లక్షణాలను గమనిస్తే జాగ్రత్తలు తీసుకోవాలి.




### బోథ్ అటవీ రేంజ్ పరిధిలో

# పెద్ద పులి సంచారం



**ముద్ర, బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ అటవీ రేంజ్ పరిధిలో ఆదివారం పెద్ద పులి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. నేరడిగొండ మండలంలోని బుద్దికొండ – వడూర్ మధ్యన రోడ్డు దాటుతుండగా తమకు పెద్ద పులి కనిపించిందని పులి ఫోటోను తీసిన వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. కాగా పులి సంచారంపై నేరడిగొండ రేంజ్ అధికారి గణేష్ ను ముద్ర ప్రతినిధి సంప్రదించగా పులి సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తాము సిబ్బందితో పులి యొక్క పాద ముద్రలను, ఆనవాళ్లను సేకరించే పనిలో ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకైతే తమకు పులి ఆనవాళ్లు ఆ ప్రాంతంలో కనిపించలేవని పేర్కొన్నారు. పులి సంచారంపై తమ నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కాగా ఆయా గ్రామాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళేవారు, పశువుల కాపరులు ఒంటరిగా వెళ్లవద్దని గుంపులుగా వెళ్లాలని సూచించారు. వ్యవసాయ పనులను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ముగించాలని, పశువుల కాపరులు ఆటవిలో లోపలివరకు వెళ్లవద్దని అన్నారు. పులి యొక్క పాద ముద్రలు, ఆనవాళ్లు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు తెలపాలని కోరారు. పులి కి ఎటువంటి హాని తలపెట్టవద్దని ఉచ్చులు, కరెంట్ తీగలు, వలలు పెట్టవద్దని సూచించారు. హాని తలపెట్టిన వారిపై వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విభేదాలొద్దు.. పార్టీ కోసం పని చేయండి

### పాలకుర్తి శ్రేణులతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** విభేదాలు పక్కనబెట్టి..పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పని చేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పాలకుర్తి నియోజకవర్గంలోని నేతలతో పాటు కేడర్‌కు పిలుపునిచ్చారు. ఆ నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలపై స్థానిక నేతలతో ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో మల్లు రవి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. క్రమశిక్షణ కమిటీ ఎదుట పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఝాన్సీ రెడ్డి హాజరయ్యారన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విదేశాల్లో ఉండడంతో ఆమె రాలేదన్నారు. ఎమ్మెల్యే యశస్విని విదేశాల నుంచి వచ్చిన తర్వాత మరోసారి రావాలని ఝాన్సీరెడ్డికి సూచించామని చెప్పారు. దీంతో ఈ నెల 30న కమిటీ ముందు వారు హాజరవుతారని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌పై ఝాన్సీరెడ్డి, యశ్వస్విని రెడ్డిలు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి కూడా పార్టీ క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు వారిని వేధిస్తున్నారంటూ తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గంలోని ఇరు వర్గాలను పిలిచి కమిటీ మాట్లాడుతుందని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌కి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అందుకు వారు రికార్డు ఎవిడెన్స్‌తో సమాధానం ఇచ్చారని తెలిపారు. ఝాన్సీరెడ్డి కూడా తన వద్దనున్న సమాచారాన్ని తమకు అందజేశారన్నారు. ఈ అంశంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటితోపాటు జిల్లాకు చెందిన నేతలందరితో కూర్చుని మాట్లాడతామని చెప్పారు. తద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

## బైకులు, కార్లతో రేసర్ల హంగామా

### మాదాపూర్ టీ హబ్ ఏరియాలో అర్ధరాత్రి యూత్ రచ్చ..



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అర్ధరాత్రి పోకిరీల హంగామా కలకలం రేపింది. నీలోఫర్ వద్ద కార్లు, బైక్‌లతో కొందరు యువకులు రోడ్లపై రేసింగ్‌కు పాల్పడ్డారు. వీకెండ్ కావడంతో అర్ధరాత్రి సమయంలో రోడ్లపై వేగంగా దూసుకెళ్తూ రేసింగ్ చేశారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయినా రేసర్లు పట్టించుకోకుండా పోలీసుల వైపునకు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు వెంటాడి వారిని పట్టుకున్నారు. ఆపాలని హెచ్చరించినప్పటికీ కొందరు కార్లలో వేగంగా పారిపోవడానికి ప్రయత్నించారు. రేసింగ్ చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేసిన వారిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని వాహనాలు పోలీసులపైనే దూసుకువచ్చే ప్రయత్నం చేయగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఓ కారు అద్దాలను పగులగొట్టి లోపల ఉన్న వారిని బయటకు తీసుకుని అదుపులోకి తీసుకున్నారు. వీకెండ్ వస్తే చాలు నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి రేసింగ్‌లు, హంగామాలు పెరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## 'గుట్ట'పై వర్తక సంఘాన్ని రద్దు చేయండి

### యాదాద్రి పరిరక్షణ కమిటీ

**యాదాద్రి, ముద్ర:** యాదగిరిగుట్టపై వర్తక సంఘాన్ని రద్దు చేయాలంటూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆదివారం ఆందోళన చేపట్టింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్వామి వారి వైకుంఠ ద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు. దేవస్థాన అధికారులు వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లకు పిలవాలని డిమాండ్ చేశారు. పాత బస్ స్టాండ్ వద్ద రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు.ఈ నెల 31 వ తేదీన వర్తక సంఘం గడువు ముగిసిపోతుందని, వెంటనే కొండపైన దుకాణాలకు టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. టెండర్లు వేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. సెలవు దినం కావడంతో భారీగా భక్తుల వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న సభ్యులను పోలీసులు చెదరగొట్టారు.

### కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం

# ఎప్పటికీ మర్చిపోదు



- సుడా, జిల్లా గ్రంథాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి
- జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం అమలు
- మహిళల ఆర్థిక బలోపేతానికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం కొనసాగింపు
- సుడా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ల అభినందన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ముద్ర ప్రతినిధి ఖమ్మం:** కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, నాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు వ్యక్తం చేస్తున్న ఆనందం పార్టీపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ముందే గ్రంథాలయ ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ఖమ్మం, సూర్యాపేట, జనగాం ప్రాంతాలు ఆ ఉద్యమాలకు కేంద్రాలుగా నిలిచాయని గుర్తుచేశారు. ప్రజలపై అత్యంత ప్రభావం చూపే సంస్థ గ్రంథాలయమని పేర్కొన్నారు.2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ పార్టీ జెండాను భుజాన వేసుకుని పోరాడిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ నిర్లక్ష్యం చేయదని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం సాధించుకున్న రాష్ట్రం అని, గత పాలకులు కుటుంబ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.55 ఉన్న సన్న బియ్యాన్ని కోటి ఆరు లక్షల కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతూ లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు.మొదటి విడతలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడత మంజూరుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళల ఆర్థిక సాధికారత కోసం వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకం అమలు చేస్తామని, రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించనున్నామని చెప్పారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన నాయకులకు గుర్తింపుగా పదవులు రావడం ఆనందంగా ఉందన్నారు. సుడా ద్వారా ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావాలని సూచించారు.ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ముగ్గురు మంత్రులు అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ, సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు.

## ధాన్యం సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్

- ధాన్యం తరలింపునకు ఇసుక, సిమెంట్ లారీల వినియోగం
- కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరుతో రైతుల్ని మోసం చేస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియలో తలెత్తతోన్న జాప్యాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లారీల కొరతను అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో.. ధాన్యం తరలింపునకు ఇసుక, సిమెంట్ లారీలను వాడుకోవాలని రవాణాశాఖ అధికారులకు, జిల్లా ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఇబ్బంది కలుగ కుండా మిల్లులకు ధాన్యాన్ని సకాలంలో చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరుతో రైతుల్ని మోసం చేస్తే ఎవరినైనా క్షమించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల యాజమాన్యం లేదా మధ్యవర్తులెవరైనా క్వింటాలుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ ఇచ్చి రైతుల్ని నష్టపరిస్తే ఆ రైస్ మిల్లుల్ని బ్లాక్ లిస్టులో పెడతామని స్పష్టం చేశారు. అవసరమైతే అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కోసం రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాల శాఖలతో కూడిన ప్రత్యేక టాస్కోర్స్ బృందాలు కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్సెస్ ఫుల్ గా నడుస్తున్నాయని, రైతులకు నేరుగా వారి ఖాతాల్లోకే చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఈ ఒక్క ఏడాదే వరి రైతులకు రికార్డు స్థాయిలో రూ.45,000 కోట్లు చెల్లించామని తెలిపారు. 48 గంటల నుంచి వారం రోజుల్లోగా రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ చెల్లింపులన్నీ పూర్తయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- – టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, కార్యదర్శి రాం నారాయణ
- - ఘనంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా 3వ మహాసభ




**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ పూర్వ అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విరహత్ మాట్లాడుతూ 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన జర్నలిస్టు యూనియన్ సభ్యులుగా ఉండటం మనందరి అదృష్టమన్నారు. ఆనాటి నుండి నేటి వరకు యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం నిరంతరం ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా ఇప్పటికే 47 వేల అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్న లిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలం గా ఉన్నారని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి టియూడబ్ల్యూజే (ఐజేయు) నిత్యం ముందడుగులో ఉంటుందని, వృత్తిలో ఎదురయ్యే ఆటుపోట్లకు జర్నలిస్టులు భయపడకుండా నిజాన్ని నిర్భయంగా బహిర్గతం చేయాలన్నారు. సమాజ మేలుతో పాటు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయాలని రాష్ట్ర కార్యదర్శి కే రామ్నారాయణ అన్నారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ బివి రమణారెడ్డి , రామారావు, ఆనంద్ శ్రీనివాస్ పాల్గొన్నారు

## 93 తులాల బంగారం, 1.7 కిలోల వెండి రికవరీ

- కొడుకు, తల్లి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో సంచలనం సృష్టించిన దొంగతనం కేసును పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. పెద్ద శంకరంపేట మండలం చీలపల్లిలో ఈనెల 14న రాత్రి జరిగిన దొంగతనంలో 929.7 ( సుమారు 93 తులాలు) గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి (1.35 కోట్ల విలువ) రికవరీ చేశారు. నిందితులు కొడుకు, తల్లిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. ఆదివారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు వివరాలు వెల్లడించారు. ఈనెల 14న అర్ధరాత్రి దాటాక పెద్ద శంకరంపేట్ మండలం చీలపల్లిలో తాళం వేసిన అయిదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. రాయని రాములు ఇంట్లో పెళ్లి కోసం తెచ్చి పెట్టుకున్న నగలు కిలోన్నర బంగారం, రెండున్నర కిలోల వెండితోపాటు 19 వేల నగదు, మాణిక్యరెడ్డి ఇంట్లో 3 తులాల బంగారం దొంగిలించగా మిగతా మూడు ఇళ్లలో ఎలాంటి చోరీ జరగలేదు. దొంగతనం తీవ్రంగా పరిగణించి ఎస్పీ 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బిబ్యా నాయక్ తండాకు చెందిన జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్ ను రామాయంపేట వద్ద వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు వెల్లడించారు. దొంగతనం సొమ్మును దాచి పెట్టిన తల్లి జాదవ్ మాలి బాయిని సైతం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న జైరాం నాయక్ చెల్లి భర్త సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం హంగీరగా గ్రామానికి చెందిన రాథోడ్ ఇప్పు సింగ్ అలియాస్ ఇప్పు, చెల్లెలు రాథోడ్ సాంకీ బాయిలు పరారీలో ఉన్నారు. వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సిఐలు రేణుకా రెడ్డి, జార్జ్, ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, శంకర్, బాలరాజ్, సిబ్బంది ఉన్నారు. సిబ్బందిని ఎస్పీ నగదు రివార్డుతో సత్కరించారు. ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. తాళం వేసిన ఇళ్లలో భారీ దొంగతవాలు లక్ష్యం జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్, తన భావ రాథోడ్ ఇప్పు సింగ్ ఇద్దరు కలిసి బైక్ పై వచ్చి మెయిన్ రోడ్ కి దగ్గరలో గల గ్రామాలలో, ఊరి చివరలలో గల తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకోని ఒకేరోజు మూడు లేదా అంతకంటే ఎక్కువ ఇళ్ళలో దొంగతనాలు చేస్తారు. ఇలా దొంగతనాలు చేసి 78 కేసులలో జైలుకు వెళ్లగా కోర్టులలో ట్రయల్ నడుస్తున్నాయి. ఇంకా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో 12 కేసులున్నాయి. తాజాగా 5 కేసులు నమోదయ్యాయి.

## ఆ విమానంలో బాంబుపెట్టాం

**ఆమ్‌స్టర్‌డామ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానానికి బాంబు బెదిరింపు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. ఆదివారం ఆమ్‌స్టర్‌డామ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న 'కెఎల్ఎం–873' నెంబర్ గల విమానంలో బాంబు ఉన్నట్లు, అది ల్యాండ్ అయ్యేలోపు ఏ క్షణమైనా పేలవచ్చంటూ ఓ అగంతకుడు ఎయిర్‌పోర్ట్ అధికారులకు ఈ–మెయిల్ పంపాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది విమానాన్ని ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ చేయించారు. ప్రయాణికులందరినీ కిందకు దించి ఐసోలేషన్ ప్రాంతానికి తరలించి భద్రతా దళాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అందులో ఎలాంటి బాంబు లేదని నిర్ధారించాయి. దీంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మెయిల్‌పై విమానాశ్రయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews



## ఎబోలా వైరస్ లక్షణాలు.. జాగ్రత్తలు

వాంతులు, విరేచనాలు తీవ్రంగా రావడం వల్ల శరీరంలో నీరసం పెరిగి పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది.తగినంత ద్రవాలు తీసుకోవడం, డాక్టర్ సూచించిన చికిత్స వెంటనే ప్రారంభించడం చాలా ముఖ్యం.




# కనీస వేతనాల పెంపులో లోపించిన పారదర్శకత!

### - పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంపు లేదు! - కార్మిక సంఘాలు అసంతృప్తి!

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పనిచేస్తున్న 1.11 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘనిరీక్షణ అనంతరం కనీస వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ వేతనాలు జూన్ 1, 2026 నుంచి అమలులోనికి వస్తున్నాయని, ఇప్పటిదాకా ఉన్న రెండు జోన్లను.. మూడు జోన్లుగా విభజిస్తూ జోన్న్ -1 లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్న్ -2 లో మున్సిపాలిటీలు, జోన్న్ -3 లో గ్రామీణ ప్రాంతాలను తీసుకొని.. కార్మికులను నైపుణ్యాన్ని బట్టి అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వారికీ వేతనాలు ఇస్తామని తెలిపారు.



ఆన్ స్కిల్డ్ కు కనీసంగా వేతనం రూ. 14 వేలు, హైలి స్కిల్డ్ ఎక్కువలో ఎక్కువగా రూ. 20 వేలు నిర్ణయించినట్లు తెలిపారు. కనీస వేతనాలపై రాష్ట్ర మంత్రివర్గ సబ్ కమిటీ చేసిన రిక్మండీషన్స్ మేరకు పెరుగుతున్న ధరలకు కనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**కనీస వేతనాల బోర్డును ఉపయోగం లేనిదిగా మార్చాడు**

కనీసవేతనాలు నిర్ణయానికి కనీస వేతనాల చట్టం -1948 ప్రకారం కనీస వేతనాల బోర్డును కార్మికసంఘాలు, యాజమాన్యాలు, ప్రభుత్వ కార్మికశాఖల ట్రై పార్టీల ప్రతినిధులతో కనీస వేతనాల బోర్డు ఉండాలి. రాష్ట్రంలో రెండు సంవత్సరాల క్రితం వేసిన కనీస వేతనాల సలహా బోర్డు రికమండేషన్స్ ను పరిగణలోనికి తీసుకోకుండా, మంత్రివర్గ ఉపసంఘం రికమండేషన్స్ పేరిట కనీస వేతనాల ప్రకటించటము అంటేనే కనీస వేతనాల చట్టం -1948, పరిగణలోనికి తీసుకోకపోవడం చాలా విచారకరం.

**కనీస వేతనాలు ప్రతి ఐదేళ్ల కోకసారి సవరించాలి.**

రాష్ట్రంలోని 73 షెడ్యూలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 2006-2012 మధ్య కాలానికి సవరించారు. ఆ తరువాత నేటికీ సవరించలేదు. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణాలో పనిచేస్తున్న కార్మికుల కనీసవేతనాలు తక్కువగా ఉన్నాయి. గత పది సంవత్సరాలుగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలని కోరుతూ పలుమార్లు కార్మిక సంఘాలు, వర్కర్లు, అసోసియేషన్ లు ధర్నాలు, ప్రదర్శనలు లేబర్ కమిషనర్ ఆఫీసుల ముట్టడి కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాయి. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఫలితంలేక పోవడంతో 2022 లో హైకోర్టును ఆశ్రయించాయి. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అసంఘటీత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలతో పాటు, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్య ప్రాధాన్యతను గుర్తిస్తూ కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేసింది.

**గతంలో ఇచ్చిన జీవోలు కంటే తక్కువగా నిర్ణయం**

★గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆనాటి కనీస వేతనాల సలహా బోర్డు నిర్ణయం మేరకు 2021 జూన్ 25 న ఐదు షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయ్మెంట్స్ జీ వో ఎం ఎస్. నెం. 21 సెక్యూరిటీ సర్వీసెస్, జీవో నెం.22 కంస్ట్రక్షన్స్ మెయింటెనెన్స్ అఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఆపరేషన్స్, జీ వో నెం. 23 స్టోన్ బ్రేకింగ్, జీ వో నెం. 24 ప్రాజెక్టులు డ్యామస్ మొదలైనవి, జీ వో నెం. 25 ప్రైవేట్ మోటార్ ట్రాన్స్ పోర్ట్ రంగాలలో కనీస వేతనం అన్ స్కిల్ వర్కర్ కు రూ.18,019, మాక్సిమం హైలీ స్కిల్ వర్కర్ కు రూ. 39,837 లుగా నిర్ణయించారు. కరువు భత్యం పాయింట్లు రేట్లు కూడా ఆన్ స్కిల్ వర్కర్ కు రూ. 12 లు. హైలీ స్కిల్ వర్కర్ కు రూ. 26.55 ప్రతిపాదించటం జరిగింది. ఈ ఐదు జీ వో లను గెజిట్ పబ్లికేషన్స్ చేయకుండా యాజమాన్యం వత్తిడితో ఇంతకాలం ఉంచారు. మిగతా 68 షెడ్యూల్ ఎంప్లాయ్మెంట్ లోని జీ వో లను వెంటనే ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని కోరుతూ రావడం జరిగింది. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు.ఇచ్చిన జీ వో లకు గజెట్ నోటిఫికేషన్ చేయలేదు. ఈ ప్రభుత్వమైనా జీవోలకు గజిట్ విడుదల చేయాలని కార్మిక సంఘాలు డిమాండు చేస్తున్నప్పటికి పట్టించుకోలేదు.

**ప్రస్తుతం నిర్ణయించిన వేతనాలు పెంపు కాదు**

రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రస్తుతం జీవో నెంబర్ 11 ప్రకారం ఇప్పటికే కనీసం రూ. 13,098 నుంచి రూ. 23,684 వరకు వేతనాలు పొందుతున్నారు. దీనిని బట్టి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు రూ. 3,648 తక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో కనీస వేతనాలు పెంపు కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికి ఆదర్శవంతంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆచరణలో చిత్తశుద్ధిలోపించిందని, శాస్త్రీయ పద్ధతిలో వేతనాలను ప్రకటించలేదని కార్మిక సంఘాలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

**కనీస వేతన సలహా మండలి సిఫార్స్ లు పట్టించుకోని ప్రభుత్వం**

★ రాష్ట్రంలో కనీస వేతన సలహా మండలి రెండు సంవత్సరాల క్రితమే ఏర్పాటైనప్పటికీ, మండలి సమావేశాలు పలుమార్లు జరిగి.. కమిటీ సభ్యుల సూచనలను, సలహాలను ప్రభుత్వానికి ఏప్రిల్ 2025 లోనే క్రింది స్థాయి ఉద్యోగులకు రూ. 20,275 లు, అలాగే సెమీస్కిల్ కార్మికులకు రూ.23 వేలు, స్కిల్ కార్మికులకు రూ. 26 వేలు, హైలి స్కిల్ కార్మికులకు రూ. 28 వేల వేతనాలు ఉండాలని శాస్త్రీయ బద్ధంగా నిర్ణయిస్తూ కార్మిక శాఖకు నివేదికను ఇవ్వడం జరిగింది. కార్మిక సంఘాలు, కనీస వేతనాల సలహా మండలి సిఫార్సులను పరిగణలోనికి తీసుకోకుండా మంత్రివర్గ సబ్ కమిటీ పేరిట కనీస వేతనాలు మరి తగ్గించి ప్రకటించటం ఏమిటని.. ప్రభుత్వం కనీసవేతనాలను రూ.26 వేలు నిర్ణయిం చాలని గత రెండు సంవత్సరాలుగా కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

1948 కనీస వేతనాలు చట్టం, డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచ లేదు. నేడు పెరుగుతున్న ధరల కనుగుణంగా శాస్త్రీయంగా లెక్కిస్తే చాలా తక్కువగా ఉన్నాయని.. కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలని.. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్య మంత్రి పునఃపరిశీలించి వేతనాలు సవరించాలని కోరుతున్నారు.



**- ఉజ్జిని రత్నాకర్ రావు**
**9490952646**
**ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు**

# ట్రంప్ పై మూడో దాడి..

- ట్రంప్ నివాసంలో ఉండగా 25 రౌండ్ల కాల్పులు
- సెక్యూరిటీ గార్డ్స్ కాల్పుల్లో ఆగంతకుడి మృతి

**ముద్ర డెస్క్ :** అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్ హౌస్ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న కాల్పుల ఘటన అంతర్జాతీయంగా తీవ్ర సంచలనం రేపింది. ఒక దుండగుడు వైట్ హౌస్ రక్షణ వలయంలోని 17th స్ట్రీట్, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద గల సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్ లక్ష్యంగా ఈ దాడులకు తెగబడ్డాడు. తన బ్యాగ్ నుంచి ఒక్కసారిగా ఆయుధాన్ని బయటకు తీసి అక్కడ విధుల్లో ఉన్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు జరపడంతో, భద్రతా బలగాలు తక్షణమే అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన సదరు నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అధికారులు ఈ నిందితుడిని 21 ఏళ్ల నాసిర్ బెస్ట్‌గా గుర్తించారు. గతంలో 2025లో కూడా ఈయన వైట్ హౌస్ పరిసరాల్లోకి అక్రమంగా చొరబడటానికి ప్రయత్నించి అరెస్టయ్యాడని, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ కాల్పుల సమయంలో ఒక సాధారణ పౌరుడు కూడా గాయపడగా, ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేత సౌధం లోపలే ఉన్నప్పటికీ ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.అయితే, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని గడిచిన కొన్ని నెలల్లో వరుసగా భద్రతా ఉల్లంఘనలు, దాడులు జరగడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 25న వాషింగ్టన్ హిల్‌టన్ హోటల్‌లో జరిగిన వార్షిక 'వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్' వేడుకల సందర్భంగా కోల్ టోమస్ అలెన్ అనే వ్యక్తి భద్రతా వలయాన్ని దాటుకుని లోపలికి దూసుకువచ్చి కాల్పులు జరపడం అప్పట్లో అగ్రరాజ్యాన్ని కుదిపేసింది. ఆ సమయంలో డోనాల్డ్ ట్రంప్, ఇతర ఉన్నతాధికారులు వేదికపైనే ఉండటంతో భద్రతా బలగాలు ట్రంప్‌ను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాయి. ఈ ఘోర ఉదంతం జరిగి కనీసం నెల రోజులు కూడా గడవక ముందే, మళ్లీ శనివారం సాయంత్రం నేరుగా వైట్ హౌస్ చెక్‌పాయింట్ వద్దే తుపాకీ శబ్దాలు వినిపించడం అమెరికా అధ్యక్షుడి భద్రతా ఏర్పాట్లపై పెను సవాలుగా నిలిచింది. అంతేకాదు ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ నివాసంలోకి ఆ అజ్ఞాతవ్యక్తి చొరబడటానికి ప్రయత్నించగా.. భద్రతా బలగాలు హతం చేసాయి. అయితే ఆ ఆసమయంలో ట్రంప్ వైట్ హౌస్ లో లేరు.ఈ వరుస దాడుల వెనుక ఏదైనా ఇరాన్ కుట్ర కోణం ఉందా అనే కోణంలో అమెరికా గూఢచార సంస్థ ఎఫ్‌బీఐ , ఇతర భద్రతా విభాగాలు లోతుగా దర్యాప్తు ప్రారంభించాయి.

## మణికొండకు చెందిన మహిళ కేపీహెచ్‌బీ కాలనీలో అదృశ్యం

**ముద్ర కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీ లోని ఒక మహిళల హాస్టల్ నుండి 47 ఏళ్ల మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.పోలీసుల కథనం ప్రకారం... మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంబీ కన్స్ట్రక్షన్ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివసించే అనిల్ కుమార్ మేకల తల్లి వసంత మేకల (47) ఈ నెల 1వ తేదీ నుండి కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని ఎస్ఎల్‌వీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నారు.ఈ నెల 23న ఉదయం అనిల్ కుమార్, ఆయన తల్లి వసంతల మధ్య ఫోన్ లో చిన్నపాటి వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత హాస్టల్ నుండి బయటకు వెళ్లిపోయారు. అప్పటి నుండి ఆమె మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోంది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో అనిల్ కుమార్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఏపీ పారిశ్రామిక ప్రగతికి ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ కీలకం



**ముద్ర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న "ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026" రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త దిశానిర్దేశం చేయనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రవ్యాప్తంగా 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 175 ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే రెండు దశల్లో 100 పార్కులకు శంకుస్థాపన జరగగా, కొన్ని ప్రారంభమయ్యాయి. మూడో విడతలో 38 కొత్త పార్కులు ఏర్పాటవుతుండటం విశేషం. ఈ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొననున్నారు. అలాగే 1,500 మందికిపైగా పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారు. గ్రామీణ పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను ప్రారంభించనున్నారు. అదనంగా రూ.200 కోట్లతో 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులు విడుదల చేయనున్నారు. మెటా, అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది. యువత, మహిళలను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించే దిశగా ఈ సమ్మిట్ కీలక వేదికగా మారనుంది. మొత్తంగా, "ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026" ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి మైలురాయిగా నిలవనుంది.

## జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లకు రూ. 2,900 కోట్లు

**మొక్కజొన్న కొనుగోళ్లపై స్పందించని కేంద్రం**
**నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం**
**వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లకు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్ లో వివరాలు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లపై విన్నవించినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్న తుమ్మల... రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వమే ముందు కొచ్చిందన్నారు.

రైతులను కాపాడేందుకు కొనుగోళ్లు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరించేందుకు ఇప్పటికే రూ.4వేల కోట్లు విడుదల చేశామన్నారు. తాజాగా రూ.1,800 కోట్ల కేటాయింపులతో మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. భారీ దిగుబడుల నేపథ్యంలో సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. మరోవైపు రూ.1,100 కోట్లతో జొన్న పంట కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సేకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

అలాగే పొద్దు తిరుగుడు రైతులనూ ఆదుకుంటామని మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. ఈ మేరకు 25 శాతానికి మించి పంటను కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## ఆధ్యాత్మికం.. పరవశం

**కాళేశ్వరంలో వైభవంగా సరస్వతీ అంత్య పుష్కరాలు**





**ముద్ర, మహదేవపూర్ :** దక్షిణ శైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలు ఆదివారం అత్యంత వైభవంగా కొనసాగాయి. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల కలయికైన పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కరస్నానాలు ఆచరించేందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న ఈ పుష్కరాల్లో తెల్లవారుజాము నుంచే ఘాట్ల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్థానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..

**భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని స్వామి దర్శనానికి భారీగా తరలివస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవాలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్వామి దర్శనానికి దేవాలయంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు.భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**పూజలు నిర్వహించిన అద్వైతానంద భారతి స్వామీజీ**

ఈ సందర్భంగా అద్వైతానంద భారతి, శ్రీ శ్రీ అవని శృంగేరి జగద్గురువులు, శంకరాచార్య మహాసంస్థానం స్వామీజీలు శనివారం కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్చారణల మధ్య నదీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థనలు చేశారు.అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంకు చేరుకోగా ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా పార్వతి అమ్మవారికి, మహా సరస్వతి అమ్మవారికి విశేష హారతులు సమర్పించారు. అడిషనల్ కమిషనర్ ఎం కృష్ణవేణి ఆర్జేసీ రామకృష్ణారావు దేవదాయ శాఖ సలహాదారు గోవింద హరి గారు ఈఓ మహేష్, చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ వరల్డ్ లోకి మెగా ఎంట్రీ..

**'మెగా పోడ్‌కాస్ట్'కి రెడీ అవుతున్న చిరంజీవి**

**ముద్ర డెస్క్ :** టాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డుల రారాజు, మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు డిజిటల్ దునియాలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఇప్పటివరకు వెండితెరపై కోట్ల మందిని అలరించిన ఆయన, త్వరలోనే ఒక ప్రతిష్టాత్మక 'పోడ్‌కాస్ట్' ద్వారా డిజిటల్ ఆడియన్స్ ముందుకు రానున్నారు. ఈ సరికొత్త టాక్ షో ద్వారా తన ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలోని అరుదైన అనుభవాలను, తెరవెనుక రహస్యాలను చిరు పంచుకోనున్నారు. నందమూరి బాలకృష్ణతో 'అన్‌స్టాపబుల్' షోను సూపర్ హిట్ చేసిన ప్రముఖ రచయిత బి.వి.ఎస్. రవి ఈ మెగా ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేస్తున్నారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని అధికారికంగా లీక్ చేశారు. శూన్యం నుండి మొదలై చిరంజీవి చేరుకున్న శిఖరాల వెనుక ఉన్న శ్రమను, ఆయన లైఫ్ జర్నీని రాబోయే తరాలకు స్ఫూర్తిగా అందించేలా ఈ షోను డిజైన్ చేస్తున్నట్లు బి.వి.ఎస్. రవి వెల్లడించారు.

## సంజీవని సేవలను పరిశీలించిన ముఖ్యమంత్రి

**సంజీవని సహా వివిధ ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకున్న సీఎం**

**ముద్ర, పూతలపట్టు/చిత్తూరు జిల్లా :** చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని సంజీవని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సందర్శించారు. సంజీవని కార్యక్రమంలో పాల్గొనడానికి పూతలపట్టు వచ్చిన సీఎం చంద్రబాబు... తన పర్యటనలో భాగంగా పీహెచ్‌సీలో కొత్తగా ప్రవేశపెట్టిన సంజీవని డిజిటల్ వైద్య సేవల పనితీరును ల్యాబ్ డెమోల ద్వారా పరిశీలించారు. ఓ పెషంట్ పీహెచ్సీకి వచ్చి... వైద్యం చేయించుకుని మందులు తీసుకెళ్లే ప్రక్రియను మొత్తం ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ ప్రక్రియలో భాగంగా సంజీవని ద్వారా టెక్నాలజీని అనుసంధానించి ఎలాంటి వైద్యం అందిస్తున్నారోననే అంశాన్ని సీఎం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్సీలోని వివిధ విభాగాలను సందర్శించి.. అక్కడున్న సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా సంజీవని ద్వారా రోగులకు తాము ఎలాంటి సేవలను అందిస్తున్నామనే అంశాన్ని ముఖ్యమంత్రికి ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆరోగ్య సేవలను సాంకేతికతతో మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీహెచ్‌సీని సందర్శించి ప్రతి విభాగాన్ని పరిశీలించారు. పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ డెస్క్ వద్ద డిజిటల్ నమోదు విధానం, క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్, గర్భిణీలు మరియు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ట్రాకింగ్ వంటి అంశాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. స్టాఫ్ నర్స్ స్టేషన్‌లో రోగుల వైటల్స్‌ను డిజిటల్ పద్ధతిలో నమోదు చేసే విధానాన్ని కూడా వీక్షించారు.అనంతరం సంజీవని ప్లాట్‌ఫామ్ ద్వారా ఏఐ ఆధారిత వైద్య సేవల విధానాన్ని సీఎం పరిశీలించారు. రోగుల వైద్య చరిత్ర సేకరణ, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ వంటి ప్రక్రియలను వైద్యులు సీఎంకు వివరించారు. ఈ టెక్నాలజీ వల్ల వైద్యులు రోగులపై మరింత శ్రద్ధ పెట్టగలరని తెలిపారు. ఫార్మసీ విభాగంలో డిజిటల్ ప్రిస్క్రిప్షన్ల ఆధారంగా మందుల పంపిణీ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. వర్చువల్ రూమ్ ద్వారా కుప్పం ఏరియా హాస్పిటల్, బెంగళూరులోని టాటా ఎండీ నిపుణ వైద్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను సీఎం వీక్షించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు స్థానిక పీహెచ్‌సీల్లోనే అందుబాటులోకి రావడం ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పేషెంట్లు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల వల్ల ప్రయోజనం పొందుతున్నామని లబ్ధిదారులు సీఎంకు తెలిపారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 25-05-2026
www.mudranews.in | @mudranews

5

దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

**ఎబోలా వైరస్**
**లక్షణాలు.. జాగ్రత్తలు**

ఎబోలా తీవ్రమైన దశకు చేరుకున్నప్పుడు ముక్కు, నోరు, కళ్ల ద్వారా రక్తస్రావం జరగవచ్చు. ఈ పరిస్థితి ప్రాణాపాయానికి దారితీయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## అలరించిన శ్రీరామ చరితం నృత్యరూపకం

ముద్ర, శేరిలింగంపల్లి: శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి ఉదయ్ కృష్ణ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, తాండవ నృత్యకారి, నామ రామాయణం, ఒకపరి కొకపరి, రామాయణ శబ్దం అంశాలను ఐశ్వర్య, తన్వి, ఆధ్య, మహీరా, శ్రీనిక, జొశ్విక దేదీప్య మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. బెంగళూరు నుండి విచ్చేసిన శ్రీ నృత్య రంజని ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు శాంత కృష్ణ ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శనలో "శ్రీ రామ చరితం" నృత్య రూపకం అలరించింది. నంద కుమార్ గాత్రసహకారం, శ్రీ కృష్ణ బాత్ వేణువు సహకారం, శ్రీ కార్తీక్ మృదంగ సహకారం, శ్రీ శ్రీకాంత్ రిథమ్ పాడ్ పై సహకారం అందించారు. అమూల్య, రిషిత, సహస్ర, శ్రితి, శ్రావ్య, బృంద, భవ్య మొదలైన వారు ప్రదర్శించారు.

# నేటి నుంచి 30 వరకు మహిళా వారోత్సవాలు

**- కలెక్టర్ సి నారాయణ రెడ్డి**

(ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా): "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు మహిళా వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మహిళా సంక్షేమం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. మే 25న ఐఎంఎస్ భవనాల భూమిపూజలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవాలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 26న మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సుల ప్రారంభం, బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 27న మహిళా సంఘాల కోసం సోలార్ ప్లాంట్ల ప్రారంభోత్సవాలు, పోక్స్ చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించనుండగా, మే 29న రుణమేళాలు, జీవనోపాధి పథకాల పంపిణీ చేపట్టనున్నారు. మే 30న అక్షరాస్యత సాధించిన మహిళలకు సన్మానం, బాలికల కోసం మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల సిబ్బంది ప్రజల భాగస్వామ్యంతో అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, సిడిపిఓలు, థీమ్ నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా

# ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

**- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**

ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎక్కువసేపు నిరీక్షించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆదివారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తదితరులు హాజరయ్యారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ యాసంగి–2026 ధాన్యం కొనుగోళ్లు అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, చివరి గింజ వరకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు వేగంగా జమవుతున్నాయని పేర్కొన్నారు. మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో 200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీరు, తార్పాలిన్లు, సిబ్బంది, రవాణా వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న ధాన్యం తడిసినా రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు.




## జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ఏఎన్ఎం నిరంజనమ్మకు బంగారు పతకం

**- షాట్‌పుట్‌లో స్వర్ణం.. డిస్కస్ త్రోలో రజతం**

ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్: తెలకపల్లి మండలంలోని ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న అలువాల నిరంజనమ్మ 12వ జిల్లా స్థాయి పురుషులు, మహిళలు మరియు జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మహిళల విభాగంలో డిస్కస్ త్రోలో వెండి పతకం, షాట్‌పుట్ త్రోలో బంగారు పతకం సాధించి వైద్య ఆరోగ్యశాఖకు గర్వకారణంగా నిలిచారు. గతంలో కూడా అనేక పతకాలు సాధించిన నిరంజనమ్మ భవిష్యత్తులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మరింత ప్రతిభ కనబరుస్తారని నిర్వాహకులు తెలిపారు.

నిరంజనమ్మ విజయం పట్ల బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుంపల్లి నాగేశ్వరి, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్, ఆమె భర్త జిలకరి శంకర్, గౌరెడ్డిపల్లి గ్రామస్తులు నిరంజనమ్మను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియో జకవర్గంలోని పెద్దేము ల్ మండలం మంబా పూర్ గ్రామంలో నిర్వహి స్తున్న వరి ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రతి రైతుకు సమర్థవంతంగా చేరాలనే ఉద్దేశంతో కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు అందుతు న్న సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధాన్యం విక్రయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజకు సరైన మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో తాగునీరు, నీడ, పారిశుధ్య సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎటుకూరి ప్రసాద్ మరణం ప్రజాసాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటు

**ముద్ర, కాప్రా:** అభ్యుదయ రచయితల సంఘం పునర్వ్యవస్థాపకుడు, క మ్యూనిస్టు యోధుడు ఎటుకూరి ప్రసాద్ మరణం ప్రజాసాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటు అని ఏఐవైఎఫ్ నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కొనియాడారు. చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన ప్రముఖ ప్రజాసాంస్కృతిక ఉద్యమకారుడు ఎటుకూరి ప్రసాద్ మరణం తీవ్ర విషాదకరమని, వారి మృతి ప్రజా ఉద్యమాలకు, సాహిత్య–సాంస్కృతిక రంగాలకు తీరని లోటని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందన్నారు.



## వాలీబాల్ టోర్నమెంట్ లో కుషాయిగూడ టీమ్ కు ప్రథమ బహుమతి

**ముద్ర, కుషాయిగూడ:** నాగోల్ లోని ప్రభుత్వ పాఠశాల ప్లే గ్రౌండ్ లో నిర్వహించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో కుషాయిగూడ వాలీబాల్ టీమ్ కు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను కోచ్ నాగరాజు అభినందించారు. కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా డీఈఓ విజయలక్ష్మి పాల్గొని బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమం లో వంశీ, యువరాజ్ తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



# నేడు సాగునీటి ప్రాజెక్టులపై మూడు జిల్లాల సమీక్ష

**- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కీలక సమావేశం**

ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం కీలక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. ఈ సమావేశం సోమవారం ఉదయం 9 గంటలకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో జరగనుంది. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పాడి పరిశ్రమ, క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీలు, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

ఈ సమావేశంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, పనుల పురోగతి, భూసేకరణ సమస్యలు, పెండింగ్ పనులు, పునరావాస అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను తొలగించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, రైతులకు సాగునీటి అందుబాటును మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.



వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై సంబంధిత ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు సమర్పించనున్నారని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా బచేంద్రిపాల్ జన్మదిన వేడుకలు

ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్: క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో "365 రోజులు – 365 కార్యక్రమాలు"లో భాగంగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయ మహిళ బచేంద్రిపాల్ జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తూ వేసవి సెలవులను సృజనాత్మకంగా గడిపేలా చేస్తున్న క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్‌ను అభినందించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ప్రతి విద్యార్థి బచేంద్రిపాల్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించే లక్ష్యం తో చిన్ననాటి నుంచే కృషి చేయాలని సూచించారు.




క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా సైక్లింగ్, పరుగుపందెం, చెస్, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం, ఆంగ్ల పదజాలం, క్రాఫ్ట్, సోషల్ మ్యాప్ పాయింటింగ్, పాటలు, డాన్స్ వంటి అనేక పోటీలు నిర్వహించి సుమారు 150 మందికి పైగా విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. వాస రవి, దర్శి రాజయ్య, హెచ్ వంశీ, బిల్డర్ వెంకటేష్, శ్రీమతి గీత శ్రీనివాస్, మంజుల గిరి ప్రసాద్ తదితరుల సహకారంతో బహుమతులను అందజేసినట్లు పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో సహకరించిన నిర్వాహకులు, పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీఈటీ మల్లేష్, గీతా వెంకటేశ్వర్లు, యామిని, కరాటే స్వాతి రవి, సంబు శ్రీను, వాస రమేష్ బాబు, బాదం పరమేశ్వర్, సంబు పాండు, వెంకటేష్, హెచ్ ఆనంద్, విద్యార్థుల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## చెంచు మహిళపై ఎలుగుబంటి దాడి

**- మేకలు కాస్తుండగా ఘటన**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని చెంచుగూడెం పెంటకు చెందిన నిమ్మల సాలమ్మ అనే చెంచు మహిళపై ఆదివారం అడవిలో ఎలుగుబంటి దాడి చేసింది.

స్థానికులు తెలిపిన ప్రకారం.. సాలమ్మ అడవిలో మేకలు కాస్తుండగా ఆకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే అచ్చంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

**ఎబోలా వైరస్ లక్షణాలు.. జాగ్రత్తలు**



ఎబోలా వైరస్ బాధితుల రక్తం, చెమట, లాలాజలం వంటి శరీర ద్రవాల ద్వారా వ్యాపి స్తుం ది. అందువల్ల బాధితులతో ప్రత్య క్ష సంబంధాన్ని తగ్గించ చడం, గ్లౌవ్స్ మాస్కులు ఉపయోగించడం తప్పనిసరి.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

**- జిల్లాలో 75 శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తి**
**- పది రోజుల్లో పూర్తి చేస్తాం**
**- కలెక్టర్ చిత్రా మిశ్రా**




**ముద్ర, కరీంనగర్:**
జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 75 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిందన్నారు. మిగిలిన కొనుగోళ్లను కూడా వచ్చే పది రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష, అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 68 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ కొనుగోళ్ల విలువ రూ.544.74 కోట్లు కాగా, రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.407.21 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మిగతా అమౌంటు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్–అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు.

మరో పది రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాల వారీగా మిగిలిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిగిలిన ప్రక్రియను మరో పది రోజుల్లో విజయ వంతంగా పూర్తి చేయడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

## బీసీ మహిళా నాయకురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** బీసీ మహిళా నాయకురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం అంశంపై మాట్లాడుతున్న ఒక బీసీ మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో ప్రజా పాలన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ విజయోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో ఎలాంటి పదవులు లేని కాంగ్రెస్ నాయకులు నందయ్య, గిరి నాగభూషణం, బండ శంకర్‌లను అధికారులతో పాటు వేదికపై కూర్చోబెట్టడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే తమ నాయకురాలు భోగ శ్రావణి మీ ఎమ్మెల్యే సంజయ్ కుటుంబ సభ్యుల మాదిరి హైదరాబాద్ నుంచి జగిత్యాల వచ్చి ఇక్కడ కాంట్రాక్టులు తీసుకొని చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాదరి అశోక్, జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఆముద రాజు, దూరిశెట్టి మమత, మేడిపల్లి పుష్ప, ఇట్యాల రాము, పవన్ సింగ్, సింగం పద్మ, మామిడాల కవిత, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను తడుపుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది



**మహాదేవపూర్, ముద్ర:**
సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు వేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు గ్రామంలోని ప్రధాన రహదారులపై నిరంతరం నీటిని చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పని వల్ల రహదారులపై ఉష్ణోగ్రత తగ్గడంతో పాటు, ధూళి తగ్గి భక్తులకు మంచి ఉపశమనం కలుగుతోంది. ప్రత్యేకంగా పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో నీటి చల్లింపు కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బం దులు కలగకుండా చర్యలు తీసుకుం టున్నారు.

## పెట్రో ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన




**బోథ్, ముద్ర:**
దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బోథ్ పట్టణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ లపై భారీ స్థాయిలో ధరలు పెంచిందని ఎద్దేవా చేశారు. పెరిగిన ఇంధన ధరల కారణంగా నిత్యావసర సరుకులు ధరలు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గే వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బోథ్ మండల్ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ కుమార్, అట్రాసిటీ మెంబెర్ అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జంగాల భోజన్న, ఇట్టెడి రాజు రెడ్డి, యూసుఫ్, మాజీ ఎంపీటీసీ షేక్, సీనియర్ నాయకులు గంగయ్య, అబూద్, యువ నాయకులు అబ్రార్, అమీర్, సందీప్ పాల్గొన్నారు.

## వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**మహాదేవపూర్, ముద్ర:**
భక్తులకు ఇబ్బందులు కలగకుండా, వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి, ములుగు డీఎంహెచ్ వోలు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ గోపాల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్యాంపులో అందిస్తున్న సేవలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది విధుల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఎండల ఎఫెక్ట్..



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జగిత్యాల జిల్లాను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొన్ని రోజులుగా భానుడు భగ్గుమంటుండగా, ఆదివారం జిల్లాలో పలుచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో అత్యధికంగా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై జిల్లాలోనే హాట్‌స్పాట్‌గా నిలిచింది. అలాగే ఎండపల్లి మండలం గుల్లకోటలో 45.9 డిగ్రీలు, ధర్మపురి మండలం నేరెళ్ల, జైన గ్రామాల్లో 45.8 డిగ్రీలు నమోదయ్యాయి. సారంగాపూర్ మండలంలో 45.6 డిగ్రీలు నమోదవగా, జగిత్యాల పట్టణం, ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లిలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోరుట్ల మండలం ఐలాపూర్, ఇబ్రహీంపట్నం మండలం గోదూరు, రాయికల్ మండలం అల్లిపూర్ ప్రాంతాల్లో 45.2 డిగ్రీలు నమోదయ్యాయి. మల్లాపూర్ మండలంలో మరో ప్రాంతంలో 45.1 డిగ్రీలు, వెల్గటూరులో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడిమికి ఉదయం నుంచి ఎక్కడ చూసినా నిప్పుల కొలిమిలా మండుతుంది. దీంతో జనాలు ఏసీలు, కూలర్ల కిందే గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

## ఘనంగా పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో ఆదివారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ సామాన్య కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించారన్నారు. ఎన్‌ఎస్‌యూఐ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రయాణంలో పార్టీ కార్యకర్తల మనసులో మంచి స్థానాన్ని పొందగలిగారన్నారు. మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ చైర్మన్ గిరి నాగ భూషణం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఆడువాల లక్ష్మణ్, రవీందర్ రావు, పులి నర్సయ్య, మహంకాళి రాజన్న, చాంద్ పాశ, కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన జువ్వాడి నర్సింగరావు



**ముద్ర, కోరుట్ల:** జగిత్యాల జిల్లాలోని మెట్ పల్లి మండలంలో ఆదివారం రాష్ట్ర వెలమ కార్పోరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు విస్తృతంగా పర్యటించారు. మెట్ పల్లి మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి ఈతవనం కాలిపోగా ఆదివారం గ్రామస్తులతో కలిసి ఈతవనాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి జరిగిన ప్రమాదం గురించి వివరించి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపరిహారం అందేలా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి తెలిపారు. అనంతరం మెట్ పల్లి మండలం కొండ్రికర్ల గ్రామ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. జువ్వాడి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకులు ఎన్నికల్లో గెలుపు కొరకు బ్రిడ్జి నిర్మాణం చేస్తామని బాండ్ పేపర్ రాసి ఇచ్చి మాట తప్పారని, అలాంటి మాట తప్పే సంస్కృతి తమకు లేదన్నారు. కొండ్రికర్ల ప్రజల దశాబ్దాల కోరిక ఈ బ్రిడ్జి నిర్మాణం అని దీనిని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను కోరారు. అలాగే మండలంలోని కొనరావుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం వల్ల ఈత వనం కాలిపోగా స్థానిక నాయకులతో కలిసి పరిశించారు. జరిగిన నష్టాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు. జగ్గాసాగర్ గ్రామంలో కొండస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడారు. జువ్వాడి వెంట మెట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేందర్. వివిధ గ్రామాల సర్పంచ్ లు.కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.


## రాయితీ పై ఎరువులు, విత్తనాల పంపిణీ



**ముద్ర, కోరుట్ల:** పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాల పంపిణీని ఆదివారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులు, విత్తనాలు అవసరమున్న రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆదార్ కార్డు జిరాక్స్ తో మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువుల వల్ల సహజంగా నెలలో పోషకాల సామర్థ్యం పెరిగి, రసాయనిక ఎరువులు పైన ఆధారపడవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews
7
తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

## ఎబోలా వైరస్ లక్షణాలు..



జాగ్రత్తలుచేతులను తరచూ సబ్బుతో కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తిని కొంతవరకు అడ్డుకోవచ్చు.ముఖ్యంగా ఆసుపత్రులు, జనసమ్మర్ద ప్రాంతాల్లో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి.

## జర్నలిస్టుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**




**ముద్ర, కొత్తగూడెం :** జర్నలిస్టుల హక్కుల రక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభ ఆదివారం కొత్తగూడెం క్లబ్బులో ఘనంగా జరిగింది. ఈ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల విధులు, బాధ్యతలు అత్యంత కీలకమైనవని ఆయన కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఫోర్త్ ఎస్టేట్‌గా జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అమోఘమైనదని, క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. అయితే ప్రస్తుత తరుణంలో కొన్ని మీడియా యాజమాన్యాల తీరు మారాల్సిన అవసరం ఉందని, రాత్రింబవళ్లు శ్రమించే జర్నలిస్టులకు వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం, వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సుదీర్ఘకాల సమస్య అయిన ఇండ్ల స్థలాల అంశంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు దక్కే వరకు తాను వ్యక్తిగతంగా, పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి హెల్త్ కార్డు, ఇండ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమాజంలో నిష్పక్షపాత వైఖరితో వార్తలు రాసినప్పుడే జర్నలిజం విలువలు కాపాడబడతాయని, వృత్తిపరమైన బాధ్యతను విస్మరించవద్దని సూచించారు. జర్నలిస్టులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని, అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి కుటుంబాల భద్రతకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు.

## హత్యా రాజకీయాల గురించి జగదీశ్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం

**మధు హత్యతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు**
**విచారణ ప్రభావితం చేసేందుకే మాజీ మంత్రి నిరాధారమైన ఆరోపణలు**
**డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య**




**ముద్ర, సూర్యాపేట:** బీఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్యతో కాంగ్రెస్ కి ఎలాంటి సంబంధం లేదని విచారణను ప్రభావితం చేసేందుకే మాజీమంత్రి జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. హత్య రాజకీయాల గురించి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు గాను హాస్యాస్పదంగా ఉందన్నారు. మధు హత్య పాత కక్షలతో జరిగిందా వ్యక్తిగత కక్షలతో జరిగిందా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విచారణ అధికారిగా విచారణను ప్రభావితం చేయడం తగదన్నారు. హత్య రాజకీయాలను ఏనాడు కాంగ్రెస్ పార్టీ ప్రోత్స హించలేదని మూడుసార్లు ఓడిపోయినప్పటికీ మాజీ మంత్రి దివంగత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ల ఆధ్వర్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. మాజీమంత్రి తప్పుడు ఆరో పణలను ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. ఆ హత్యతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని త్వరలోనే నిజాలు తేలుతాయి అన్నారు. మా పార్టీపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై లేనిపోని నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజాద్ అలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరెని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంగరి గోవర్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వెన్న మధుకర్ రెడ్డి, మద్దెబోయిన శ్రీనివాస్, గడ్డం వెంకన్న, పడిదల రవి, అక్కేనపల్లి జానయ్య, అన్నమయ్య రాము, నరేందర్ నాయుడు, కోడి వెంకటయ్య, బొప్పాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా విషాదంగా మారకుండా జాగ్రత్త పడుదాం

**సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ**

**ముద్ర, సూర్యాపేట:** వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండడంతో ఎంతో మంది పిల్లలు యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవ డానికి బావుల వద్దకు, చెరువులు , కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జారిగే అవకాశం ఉన్నందున అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు సూచించారు.ఈత రానివారు బావులు,చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈత నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యముగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వదకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగి నట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లల యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్పీ గారు తల్లిదండ్రులకు సూచించారు.

## అంగరంగ వైభవంగా నిత్య కళ్యాణం



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమం త్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశు లైనారు. ఆదివారం సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనం, సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. సహస్ర నామార్చన సేవ, లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆది మధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీ ధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగ ళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## మచ్చలేని మహోన్నత నేత గిరిప్రసాద్

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు**
**ఘనంగా నల్లమల గిరి ప్రసాద్ వర్ధంతి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించిన సిపిఐ అగ్రనేత గిరిప్రసాద్ మచ్చలేని మహోన్నత నాయకుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. నల్లమల గిరి ప్రసాద్ 40వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభకు ముందు పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. సిపిఐ పతాకాన్ని జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆవిష్క రించారు. వర్ధంతి సభలో హేమంతరావు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన గిరిప్రసాద్ మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటంలో సాయుధ దళ నేతగా పని చేశారన్నారు. వేలాది ఎకరాల భూమిని పంపిణీ చేస్తూ వందల గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర గిరిప్రసాద్ ది అన్నారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తుపాకీ గుండు మచ్చ తప్ప మరొక మచ్చ లేదని స్పష్టం చేశారు. శాసనసభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన భారతదేశ రాజకీయ చిత్రపటంపై తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదిం చుకున్నారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పోరాడటమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని తెలిపారు. ఈ దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని యువత మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగు బాటుకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఈ దేశాన్ని నిరుద్యోగం, అవినీతి పట్టి పీడిస్తు న్నాయని అదే సమయంలో ఉపాధి, ఉద్యోగ కల్పన రంగాలు పూర్తిగా ఉనికిని కోల్పోతు న్నాయన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశి వరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, జిల్లా నాయకులు గాదె లక్ష్మి నారాయణ, ఏసు, మోహన్రావు, కృష్ణమూర్తి, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు జరపడం అభినందనీయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణ, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు జరపడం అభి నందనీయం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యాసంగి – 2026 సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యాయని వివరించారు. జిల్లాలలో కూడా ధాన్యం సేకరణను వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి అన్ని చోట్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గడిచిన మూడు సీజన్ ల నుండి స్వతంత్ర భారత దేశంలోనే ప్రభుత్వ పరంగా రైతుల నుండి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలుస్తోందని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి పెద్ద ఎత్తున ధాన్యం సేకరిస్తున్నామని వివరించారు. సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రైతుల ఖాతాలలో రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు జమ చేశామన్నారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరిన దృష్ట్యా, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ రైతుల నుండి మిగిలిన ధాన్యం నిల్వలను సైతం వేగంగా కొనుగోళ్ళు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఒకవేళ వర్షాలకు ధాన్యం తడిసినా, దానిని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈ మేరకు రైతులకు భరోసా కల్పించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే, నేరుగా తమ దృష్టికి తేవాలనీ అన్నారు. తాలు, తరుగు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ వరి పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారని, ఇది పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు భూసారం దెబ్బతిం టుందని, ప్రమాదాలు జరిగేందుకు ఆస్కా రం ఏర్పడుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా రైతులకు గ్రామగ్రామాన విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్ తదితరులు ఈ నెల 25 నుంచి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహిళా సంక్షేమ కార్య క్రమాలకు సంబంధించి కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, సివిల్ సప్లై అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో ద్విచక్ర వాహనం దగ్ధం



**ముద్ర,. తుంగతుర్తి:** తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామ శివారులోని స్మశాన వాటిక సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచే సుకుంది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి దాదాపు పది ఎకరాల మేర విస్తరించాయి. దీంతో రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, కార్యదర్శి వీరేందర్ వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామస్థుల సహకారంతో శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.మంటలను ఆర్పే ప్రయత్నాల్లో ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి మంటలు వ్యాపించకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే ధాన్యం రాసులు వ్యవసాయ సామాగ్రి అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉండేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే అగ్ని ప్రమాదంతో పంట పొలాల్లో గడ్డి, ఎండిన అవశేషాలు కాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.సంఘటనపై స్థానిక అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం రావాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు రోజురోజుకు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని, ఎలాంటి అనుమతులు లేకుండా విద్యను వ్యాపారంగా స్కూల్లలో డొనేషన్లు బుక్స్ యూనిఫాం అమ్ముతూ తల్లిదండ్రుల నుంచి వేలల్లో ఫీజులు తీసు కుంటున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యాసంస్థల్లో ఉచితంగా విద్య అందించాలని చెప్తున్నా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యను వ్యాపారంగా చేస్తూ లక్షలలో ఫీజులు తీసుకుంటున్నారని అన్నారు. తమిళనాడు కేరళ కర్ణాటక మహారాష్ట్ర రాజస్థాన్ గుజరాత్ పశ్చిమ బెంగాల్ , పంజాబ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తెచ్చాయని తెలంగాణలో కూడా ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రాలేదని అన్నారు. జిల్లాలో ఎలాంటి అనుమతి లేకుండా అడ్మిషన్ చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, లావుడియా రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, హిందూ రాణి, ధరావత్ జగన్ నాయక్, పుట్టల ఉదయ్ జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న ,అక్షిత పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతు గోస - బీజేపీ భరోసా యాత్ర

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నేటి నుంచి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద 'రైతు గోస – బీజేపీ భరోసా' యాత్ర విజయ వంతం చేయాలని బిజెపి రాష్ట ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎన్ ఆర్ గార్డెన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నుండి మన జిల్లా మీదుగా వివిధ మండలాలను సందర్శిస్తూ నేరుగా రైతులతో మాట్లాడితే ధాన్యం ఎంత కొనుగోలు చేస్తారో తెలుస్తోందని, రెండు రోజుల పాటు రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము మాట్లాడిస్తామన్నారు. అన్నదా తలకు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి ,రాష్ట కార్యవర్గ సభ్యులు మాయ దశరథ , మాజి రాష్ట కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి , భువనగిరి పట్టాన అధ్యక్షుడు రత్నపురం బలరాం , పాదరాజు ఉమా శంకర్ బబ్బూరి సురేష్ మండల అధ్యక్షుడు చిరిక సురేష్ రెడ్డి లు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews



**ఎబోలా వైరస్ లక్షణాలు..జాగ్రత్తలు**



ఎబోలా అనుమానం ఉన్న వ్యక్తిని వెంటనే ప్రత్యేక వైద్య కేంద్రానికి తరలించాలి. తొంద రగా గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణనష్టం తగ్గే అవకాశం ఉండటంతో పాటు ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించవచ్చు.

# నేటి నుంచి మహిళా ఆర్థిక వారోత్సవం

**- అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలి**

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మహిళా ఆర్థిక వారోత్సవం ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా జిల్లాలో మహిళా ఆర్థిక వారో త్సవం నిర్వహించనున్నట్లు జి తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజు వారి కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాసరావు, మెప్మా ఇందిరా, పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**65 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి..**

ఇప్పటివరకు జిల్లాలో సుమారు 65 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన కొనుగోళ్లను కూడా వచ్చే పది రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 50134 రైతుల నుండి 2,41,574.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. 34,460 రైతులకు. రూ.379.47 కోట్లు జమ చేశామన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** చిన్నకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980–81 లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్నకోడూర్ లోని టీచర్స్ భవన్ లో జరుపుకున్న సమ్మేళనంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, సుందరయ్య, యాదగిరిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాము చేసిన అల్లరి పనులను, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందపడ్డారు. 45 సంవత్సరాల తర్వాత మళ్లీ అందరూ కలుసుకోవడంతో తమ సాధకబాధకాలను పంచుకు న్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, చంద్రారెడ్డి, సలీం, శివశంకర్, కృష్ణమూర్తి, ఓషయ్య, కుంటయ్య, వెంకట్ రెడ్డి, మధుర, వకుళ, పద్మ, రాజేశ్వరి, సుకన్య, పుష్ప, సంజీవరెడ్డి, నందారెడ్డి, శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు వాయిదా




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సిద్దిపేట పట్టణంలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు వాయిదా పడ్డట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవనంలో కాముని గోపాలస్వామి అధ్యక్షతన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా అనివార్య కారణాల వల్ల సిద్దిపేటలో జరగవలసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు వాయిదా వేశామన్నారు. సమావేశాలు నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డు బర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



**ముద్ర, హైదరాబాద్:**
శంకరపట్నం మండలం మొలంగూర్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలను వేదికగా చిన్ననాటి మిత్రులంతా ఒక్కచోటకు చేరి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా పదహారేళ్ల తర్వాత కలిశారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను శాలువా కప్పి జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పని చేయించుకుంటూ పైసలిస్తలేరు

**- లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**
రాష్ట్ర ప్రభుత్వం తమతో పని చేయించు కుంటూ వేతనాలు మాత్రం ఇవ్వడం లేదని తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. లైసెన్స్ సర్వేయర్లకు కనీస పని, గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాము కష్టపడిన పనికే వేతనం అడుగుతున్నామని, తమది గొంతెమ్మ కోరిక కాదన్నారు. గౌరవప్రదమైన హక్కు అని పేర్కొన్నారు. తమ హక్కుల సాధన కోసం ఈ నెల 26 చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆత్మగౌరవ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు తిరుపతి, బాలకృష్ణ, రామానుజన్, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..**

## వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురించి ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ లో నిర్మల్ జిల్లా నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ఫెడ్ డీఎం మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీఓ విజయలక్ష్మి , మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బర్తిపూర్ సీఎస్ఐ చర్చి వార్షికోత్సవ వేడుకలు



**ముద్ర, హైదరాబాద్:**
నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం బర్తిపూర్ గ్రామంలోని సీఎస్ఐ చర్చి 11వ వార్షికోత్సవ వేడుకలను పెస్బిటర్ ఇంచార్జీ మెదక్ అధ్యక్ష మండల ఎక్యు మెనికల్ సెక్రెటరీ రెవ దినోకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీడీసీసీ చైర్మన్ నిజామాబాద్ రెవ సీహెచ్ జారీ మాట్లాడారు. ఈ సందర్భంగా చర్చిలో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా చర్చిలో కేక్, స్వీట్లు పంచారు. ప్రార్థన అనంతరం అన్నదానం నిర్వహించారు. మత పెద్దలు ధర్మం, నీతి లాంటి అనేక సుగుణాల గురించి వివరించారు. ఏసుక్రీస్తు బోధనలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కే భాస్కర్, నడిపల్లి ప్రెస్బిటరీ ఇన్చార్జ్ రెవ ఎం స్టీవెన్ కుమార్, బాడ్సి సీఎస్ఐ రెవ బీ ప్రవీణ్, కమిటి సభ్యులు ఏ పద్మారావు, ఏ పౌలు, ఎస్ పద్మారావు, ఎన్ దేవరాజ్, ఎం ప్రకాశం, ఎన్ జాన్ బాబు, మహేంధీర్, సురేష్, శోభమ్మా, కృప, ప్రతిమ, రుచిత తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి నర్సారెడ్డి విగ్రహావిష్కరణ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పట్టణంలో ఏర్పాటు చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారులు వి. హనుమంతరావులు ఆదివారం ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రజాసేవలో ఆయన అజాత శత్రువుగా కొనసాగారని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి కుమారులు పి.సుదర్శన్ రెడ్డి. పి సంజీవరెడ్డి, నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాని, పీసీసీ ప్రధాన కార్యదర్శి యూసుఫ్ జాహీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంత్ అలీ, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, నిర్మల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, మురుసు సత్యనారాయణ, ఐరా నారాయణరెడ్డి దశరథ్, రాజేశ్వర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**మహాదేవపూర్, ముద్ర:**
జయశంకర్ జిల్లాలో రాబోయే మూడు రోజుల పాటు తీవ్ర ఎండలు ఉండే పరిస్థితులు దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఇటీవల నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45.7 డిగ్రీల నమోదు అయ్యిందని, ఈ నేపథ్యంలో రాబోయే మూడు రోజులు ఉష్ణోగ్రతల అంచనాల మేరకు వాతావరణ శాఖ జిల్లాల వారీగా హెచ్చరికలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాల్లో రాబోయే మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల పైగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం వంటి ద్రవాలు తరచూ తీసుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా గుడ్డ కట్టుకోవాలన్నారు.

## కారును ఢీకొన్న లారీ..

**- ముగ్గురికి తీవ్ర గాయాలు**




**ముద్ర, హైదరాబాద్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామ శివారులో ఓ లారీ, కారును ఢీకొట్టింది. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విష మంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6–3–569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com